వేతనదారుల అవస్థలు!


టెక్కలి సమీపంలో పనులు చేస్తున్న వేతనదారులు

- ఐదు వారాలుగా అందని ఉపాధి వేతనాలు
- పని ప్రదేశాల్లో కానరాని నదుపాయాలు

టెక్కలి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులు (ఎన్ఆర్ఈజీఎస్) అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఒకపక్క వేతనాలు అందక, మరో పక్క పనిచేసేచోట కనీస సౌకర్యాలు లేక అల్లాడిపోతున్నారు. వేతనదారులకు ఐదు వారాలుగా వేతనాలు అందకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. ఉన్న ఊర్లోనే పనులు కల్పించి వలసలను నివారించాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ లక్ష్యం నెరవేరని పరిస్థితి నెలకుంది. వేతనదారులకు పని ప్రదేశాల్లో కనీసం నీడ, మంచినీటి సదుపాయం కూడా లేకపోవడంతో అల్లాడిపోతున్నారు. మరో వైపు కొన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు పని చేసిన ఉపాధి క్షేత్ర సహాయకులను రాజకీయ వేధింపులతో తొలగించడంతో ఆయా పంచాయతీలకు సంబంధించి ఇన్చార్జి, మేట్లతో పనులను కొనసాగిస్తుండడంతో పనులపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ కొరవడుతోంది. అంతేకాకుండా కనీస వేతనంగా రూ. 300 అందజేస్తామని చెప్పినప్పటికీ ఆ దిశగా వేతనాలు గిట్టుబాటు కావడం లేదని వేతనదారులు వాపోతున్నారు.

వేతనాల కోసం ఎదురుచూపులు..

టెక్కలి నియోజకవర్గం పరిధిలోని టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో సుమారు 12 వేల మంది ఉపాధి వేతనదారులు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం అధికారుల అంచనాల ప్రకారం ఒక్కొక్కరికీ రోజుకు రూ. 250 నుంచి 270 రూపాయల వరకు వేతనం అందాల్సి ఉంది. అయితే ఐదు వారాలుగా వీరికి వేతనాలను చెల్లించకపోవడంతో వీరంతా ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు.


పని ప్రదేశంలో నీడ లేకపోవడంతో కర్రలు, ఆకులతో పందిరి వేసుకుంటున్న వేతనదారులు

రోజూ పనికి వస్తున్నాం..


రోజూ ఉపాధి పనికి వస్తున్నాం. అయితే ఐదు వారాల నుంచి ఒక్క రూపాయి కూడా అందడం లేదు. పని చేస్తున్న దగ్గర కనీసం నీడ సదుపాయం లేదు. సకాలంలో వేతనాలు అందజేసి పని దగ్గర మౌలిక వసతులు కల్పించాలి. మంచి నీళ్లు కూడా మేమే తెచ్చుకుంటున్నాం.

-జి.విజయలక్ష్మి, వేతనదారు, శ్యామసుందరపురం

రోజూ అడుగుతున్నాం..


మేము చేసిన పనికి రావాల్సిన వేతనాల కోసం రోజూ మేట్‌ను అడుగుతున్నాం. మాకు ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఆ బాధ్యతలను మేట్ చూస్తున్నారు. ఐదు వారాలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు అందజేసే విధంగా చూడాలి.

-జి.జయలక్ష్మి, వేతనదారు, శ్యామసుందరపురం

వేతనాలు పెండింగ్ వాస్తవమే..

ఉపాధి పనులకు సంబంధించి ఇటీవల కొంత వేతనాలు పెండింగ్ వాస్తవమే. ఇప్పటికే ఈ సమస్య ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. మరి కొద్ది రోజుల్లో పెండింగ్ వేతనాలన్నీ వచ్చేస్తాయి. ఎటువంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

-పి.శైలజ, ఏపీడీ, ఎన్ఆర్ఈజీఎస్, టెక్కలి

బొడ్డేపల్లి ఆశయాలను కొనసాగిద్దాం


రాజగోపాలరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

కాశీబుగ్గ: దివంగత ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు ఆశయాలను కొనసాగిద్దామని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. రాజగోపాల్ జయంతి సందర్భంగా బుధవారం కాశీబుగ్గలోని ఆయన విగ్రహానికి అప్పలరాజు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత రాజగోపాల్‌కు దక్కిందన్నారు. జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

- కాశీబుగ్గ కేటీ రోడ్‌లోని రాజగోపాలరావు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ప్రముఖ శస్త్ర చికిత్సల వైద్య నిపుణులు డాక్టర్ జీవితేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు తదితరులు నివాళులర్పించారు. సనపల సింహాచలం, రోణంకి శ్రీనివాసరావు, నంబాళ్ల కోదండరావు, బమ్మిడి రాజారావు పాల్గొన్నారు.

ఘనంగా రహదారి భద్రతా వారోత్సవాలు


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కవిటి (ఇచ్ఛాపురం రూరల్): కవిటి మండలం గొర్లెపాడు టోల్ ప్లాజా వద్ద బుధవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా బరంపురం ఎన్‌హెచ్ఏ-1 పీడీ దర్సీ ప్రకాశ్, ఆర్ఈ సాహూ, ప్రాజెక్ట్ మేనేజర్ అనీష్ జాన్‌లు రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు ముగింపు సందర్భంగా మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్ సెంథిల్ కుమార్, వీవీకేవీ ప్రసాద్, కొప్పల రవిబాబు, కిరణ్ కుమార్, రమేష్ బాబు పాల్గొన్నారు.

పనిఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించండి


ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

కవిటి(ఇచ్ఛాపురం రూరల్): సర్వేలు, ఇతర పనులను తమతో చేయిస్తుండడంతో పనిభారంతో అనారోగ్యం పాలవుతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించాలని కోరారు. ఈ మేరకు కవిటి మండలాభివృద్ధి కార్యాలయం వద్ద బుధవారం ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి వినత పత్రం అందజేశారు. వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలు అమలు పరిచే బాధ్యత తమకు అప్పగించడంతో కుటుంబాలతో గడపలేని పరిస్థితి నెలకుందని, చాలా మంది అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు.

క్రమశిక్షణే విద్యార్థికి తొలి విజయం

- అడిషనల్ ఎస్పీ మోహనరావు

కవిటి(ఇచ్ఛాపురం రూరల్): విద్యార్థి దశలో క్రమశిక్షణే వారి విజయానికి తొలిమెట్టని పూర్వ విద్యార్థి, క్రైమ్ బ్రాంచ్ అడిషనల్ ఎస్పీ లమ్మత మోహనరావు అన్నారు. బుధవారం ఆయన తాను చదువుకున్న బొరివంక ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ప్రీఫైనల్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం సనపల రామకృష్ణ, గెస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బల్లెడ శంకరరావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆడిట్

సోంపేట: బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా కమిషనరేట్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ డి.రామారావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బడ్డ రాంబాబు ఆధ్వర్యంలో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించి అకాడమిక్ ఆడిట్ బుధవారం నిర్వహించారు. అకాడమిక్ అడ్వయిజర్లు అన్ని విభాగాల రికార్డులు పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో అధ్యాపకులకు నాక్ నిబంధనలకు అనుగుణంగా సూచనలు, సలహాలు చేశారు. అడ్వయిజర్లుగా టెక్కలి, ఇచ్ఛాపురం కెమిస్ట్రీ అధ్యాపకులు వి.లూక్‌పాల్, ఎన్.శివకుమార్ వ్యవహరించారు. వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ పాల్గొన్నారు.

‘ఆదిత్య’లో పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నూతన పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. సీఎస్ఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు బండారు రమేష్, జి.విజయకుమార్, బి.రాజేష్, ఎం.వరలక్ష్మి తదితరులు ది పవర్ ఆఫ్ డేటా, ఏ గైడ్ టు డేటా బేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ అనే పుస్తకాన్ని రచించారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సీఎస్ఈ హెచ్‌ఓడీ వై.రమేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం జరగాల్సిన బడ్జెట్ సమావేశం వాయిదా పడింది. టీడీపీ కౌన్సిల్ సభ్యులంతా హాజరైనప్పటికీ వైఎస్సార్‌సీపీకి చెందిన ముగ్గురు మినహా మిగిలినవారంతా గైర్హాజరయ్యారు. దీంతో కోరం సరిపడకపోవడంతో సమావేశాన్ని కమిషనర్ వాయిదా వేశారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవికుమార్

సోంపేట: ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బారువ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ వార్డెన్ బి.రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు సంఘ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో నిర్వహించిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

బాలలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

పలాస: బాలలను పనుల్లో పెట్టుకునే వారిపై చర్యలు తీసుకుంటామని కార్మిక అధికారి మట్ట విజయకుమార్ అన్నారు. పలాస-కాశీబుగ్గ పట్టణంలోని పలు దుకాణాల్లో బుధవారం తనిఖీలు చేపట్టి ముగ్గురు బాల కార్మికులను గుర్తించారు. వీరిని పాఠశాలల్లో చేర్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా చైల్డ్ లైన్ అధికారి శ్రీనివాసరావు, పోలీసు కానిస్టేబుల్ పోలయ్య, సీఆర్ఎంటీ ఉర్మాన అప్పలరాజు ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి


నందిగాం: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు


ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు పాఠశాలలో డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థినులు



సోంపేట: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని వక్తలు అన్నారు. ఈదుపురం, డొంకూరు, కవిటి మండలం సహాలాలపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉజ్వల భవిష్యత్‌కు పదో తరగతి కీలకమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు బి.తమ్మయ్య, రేఖ, ప్రసన్న లిమ్మాయిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిగాం: నందిగాం ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. పరీక్షల్లో సులభంగా మార్కులు సాధించేందుకు మెలకువలను ఉపాధ్యాయులు వివరించారు. గణితంలో వంద మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున్న ప్రోత్సాహకం అందిస్తానని గణిత ఉపాధ్యాయులు కుమారస్వామి, మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే రూ.5 వేలు అందజేస్తానని ఆంగ్ల ఉపాధ్యాయుడు పి.ఫాల్గుణరావు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

సోంపేట: పలాసపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా పిల్లలు నృత్యాలతో అలరించారు. ప్రధానోపాధ్యాయులు బి.హరికృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ జి.రాజేంద్ర, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పేరాడ తిలక్

బలహీనవర్గాల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు


టెక్కలిలో కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ చేస్తున్న ఇన్‌చార్జి తిలక్, పార్టీ శ్రేణులు


ఇచ్ఛాపురం: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పిరియా విజయ, నర్తు రామారావు


కాశీబుగ్గ: పలాసలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి అప్పలరాజు

టెక్కలి: బడుగు, బలహీన వర్గాలతో పాటు అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి సంక్షేమం చేరువ చేయడం, రాష్ట్రాభివృద్ధి కోసం స్థాపించినదే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ నాయకుల సమక్షంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వైఎస్సార్ జంక్షన్‌కు చేరుకుని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీకి చెందిన నాలుగు మండలాల అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

ఇచ్ఛాపురం: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా వైఎస్సార్ సీపీని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థాపించారని ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త, జిల్లాపరిషత్ చైర్మన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు అన్నారు. పట్టణంలోని బస్టాండ్ కూడలిలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి నివాళర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీలు బోర పుష్ప, నిమ్మన దాసు, పైల దేవదాస్, జెడ్పీటీసీ సభ్యులు ఇప్పిలి లోలాక్ష్మి, ఉప్పాడ నారాయణమ్మ, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతిదివ్య, సీపాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, మున్సిపల్, మండల పార్టీ అధ్యక్షులు బి.ప్రకాశరావు పట్నాయక్, పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, కడియాల ప్రకాష్, మృత్యుంజయ్, కాళ్ల సత్యం, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు ప్రత్తి అన్వేష్, ముఖ్యనాయకులు ఇప్పిలి కృష్ణారావు, సల్లా దేవరాజు, బర్ల నాగభూషం, నీలాపు ఢిల్లి, పరటి కోటి, సుగ్గు ప్రేమ్‌కుమార్, బచ్చు జగన్, గుజ్జు తారకేష్, బుడ్డెపు త్రినాద్, గాంధీ, ధర్మతేజ నాలుగు మండలాల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ

కాశీబుగ్గ: ప్రజలకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంటుందని మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పార్టీ ఆవిర్భవ దినోత్సవాన్ని స్థానిక కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కాశీబుగ్గ సంత మైదానంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రూ. 10 వేల ఆర్థిక సాయం


సాయికృష్ణకు సాయాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: తల్లిదండ్రులు రోజుల వ్యవధిలోనే అనారోగ్యంతో మృతి చెందారు. దీన్ని తట్టుకోలేని కొడుకు పక్షవాతానికి గురై మంచం పట్టాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు అండగా నిలిచారు. పలాస మండలం బొడ్డపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003లో పదో తరగతి చదువుకున్న ఇచ్ఛాపురం సాయిక్రిష్ణ పక్షవాతంతో కాలు, చేయి పని చేయకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. అతనితో చదువుకున్న మిత్రులు పరామర్శించి ధైర్యం చెప్పి పది వేల రూపాయలను అందజేశారు. బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్, పోతనపల్లి సింహాచలం, పత్రి తాతారావు, బొడ్డు యుగంధర్, కేశవరావు, తిరుమలరావు ఉన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

కంచిలి: క్రమశిక్షణతో కూడిన విద్యతోనే అభివృద్ధి సాధ్యమని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రం కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు సీతారాంనాయుడు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా దేశ మొదటి రాష్ట్రపతి దివంగత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

క్లుప్తంగా

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

టెక్కలి: వేసవి దృష్ట్యా మండల వ్యాప్తంగా ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సీహెచ్.లక్ష్మీబాయి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు నీటి ఎద్దడి అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్, ఈఓపీఆర్‌డీ సింహాద్రి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు డొంకూరు విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు డొంకూరు ఉన్నత పాఠశాలకు చెందిన బి.సుధాకర్, జె.అను, జెస్సీమేరీలు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి హెచ్ఎం వై.కమలాకరరావు తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లా పులివెందుల వేదికగా జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. కోచ్ వజీర్ అహ్మద్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నాలుగు పరీక్ష కేంద్రాల కేటాయింపు

నందిగాం: ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల కోసం నందిగాం మండలంలో నాలుగు కేంద్రాలు కేటాయించినట్లు ఎంఈవో-1 జి.నర్సింహులు బుధవారం తెలిపారు. మండలంలోని 14 ఉన్నత పాఠశాలలు, గురుకులం, కేజీబీవీ, రెండు ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 418 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉందన్నారు. నందిగాం గురుకుల పాఠశాల కేంద్రంలో 118, నందిగాం పాఠశాలలో 98, నర్సిపురం పాఠశాలకు 106, నౌగాం ఉన్నత పాఠశాల కేంద్రానికి 96 మంది విద్యార్థులను కేటాయించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని పలాస విద్యుత్ శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు పనులు చేపడుతున్నందున మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పూండి, పీఎంపురం, అమలపాడు, కేఆర్‌పేట పాతటెక్కలి, కొత్తపేట, దేవునల్తాడ తదితర గ్రా మాలకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భూసర్వేపై గ్రామ సభ


మాట్లాడుతున్న జేసీ అహ్మద్‌ఖాన్

మందస: మండలంలోని ముకింతపురం గ్రామంలో భూసర్వేపై అధికారులు బుధవారం గ్రామసభను నిర్వహించారు. సభలో పాల్గొన్న జిల్లా జాయింట్ కలెక్టర్ పర్వాజ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. సర్వే ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పితాతోళి గ్రామంలో కూడా భూముల రీసర్వే చేపట్టాలని జేసీ ఆదేశించారు. సభలో తహసీల్దార్ ఎస్.హైమావతి, సబ్ రిజిస్ట్రార్ రఘురామ్ పండా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సమస్య తీర్చాలని వినతి

కవిటి (ఇచ్ఛాపురం రూరల్): జగతి పంచాయతీ పరిధిలోని మత్స్యకార గ్రామాలైన పెద్ద కర్రివానిపాలెం, బట్టివానిపాలెంలో నెలకున్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరారు. ఈ మేరకు జగతి పంచాయతీ సర్పంచ్ పూడి వరప్రసాద్, వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, ఉప సర్పంచ్ భూషరాజు, కులాధికారి కర్రి లచ్చయ్యలు శ్రీకాకుళంలోని డీపీవో భారతి సౌజన్యను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ఘననివాళి..


అభివృద్ధి ప్రదాత.. దివంగత మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు అని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు అన్నారు. రాజగోపాలరావు జయంతి సందర్భంగా కోటబొమ్మాళిలోని ఆయన విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి బొడ్డేపల్లి చేసిన కృషిని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాజగోపాలరావు జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారన్నారు. కూటమి ప్రభుత్వంలో కనీసం గుర్తు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. నాయకులు ఆర్.మల్లేశ్వరరావు, ఎస్.హేమసుందర్‌రాజు, ఎన్.సత్యరాజ్, డి.వెంకట్రావు, కె.గోవింద్, వై.మన్మథరావు, పి.వెంకట్రావు, ఎస్.వినోద్, రామకృష్ణ, జనార్దన్‌రెడ్డి, టి.గణపతిరావు, ఎం.సింహాచలం, హెచ్.గోవింద్, బి.వెంకటరమణ పాల్గొన్నారు. -టెక్కలి

గ్లకోమాపై అవగాహన


గ్లకోమా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మందస పీహెచ్‌సీ నేత్ర వైద్యాధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. నారాయణపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా కంటివ్యాధులపై ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. 40 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. -మందస

మామిడి కాయలు వచ్చేశాయ్..


అమ్మకానికి మామిడి కాయలు మార్కెట్లోకి వచ్చేశాయ్. వాస్తవంగా ఇచ్ఛాపురం ప్రాంతంలో మామిడిపంట పూతదశలోనే ఉంది. అయితే ఒడిశాలో పంట చేతికి రావడంతో స్థానిక వ్యాపారులు అక్కడ నుంచి మామిడికాయలను తీసుకొచ్చి ఇచ్ఛాపురంలో అమ్మకాలు చేస్తున్నారు. కిలో వంద రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. - ఇచ్ఛాపురం టౌన్